


# అబద్ధమాడని నోరు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

విశ్వేశ్వరరావు బిజినెస్ ట్రిప్ అనుకోకుండా రద్దయింది. ఆఫీస్ పని మీద హైదరాబాద్ నుంచి వరంగల్‌కి వెళ్లాడు. ఐతే వరంగల్‌లో విశ్వేశ్వరరావు పని చేసే ఫ్యాక్టరీ నుంచి సరుకుని దిగుమతి చేసుకోదలచిన వ్యాపారస్తుడు కోయంబత్తూరు నుంచి ఇంకా తక్కువ ధరకి దిగుమతి చేసుకుంటున్నాడని తెలిసింది. ఆ ధరకి తాము సరఫరా చేయలేం కాబట్టి విశ్వేశ్వరరావు ముందనుకున్నట్లుగా ఓ రోజు వుండకుండా ఓ గంటలో కారెక్కి డ్రైవర్‌కి చెప్పాడు.

''హైదరాబాద్ పోనీ''

ఇంటి నుంచి బయలుదేరిన ఐదో గంటకి విశ్వేశ్వరరావు తిరిగి వెనక్కి బయలుదేరి తొమ్మిదో గంటకి ఇంటికి చేరుకున్నాడు. విశ్వేశ్వరరావు కారు దిగాక డ్రైవర్ ఆఫీసుకి కారులో వెళ్లిపోయాడు.

డోర్ బెల్ కొట్టాడతను. ఒకటికి మూడు సార్లు కొడితే కానీ విశ్వేశ్వరరావు భార్య సుమతి తలుపు తీయలేదు.

''అదేమిటి? అప్పుడే వచ్చేసారు?'' ఆశ్చర్యపోయింది.

''పని కాలేదు'' బ్రీఫ్‌కేస్‌తో లోపలకి నడుస్తూ అడిగాడు. ''బెల్లు వినపడలేదా?''

''వినపడింది. బాత్‌రూంలో వున్నాను.''

దుస్తులు మార్చుకుని విశ్వేశ్వరరావు టీవీ ముందు కూర్చున్నాడు. హిస్టరీ ఛానెల్‌లో ఎనిమిదికి వచ్చే 'మాడ్రన్ మార్వలెస్' కార్యక్రమం చూడసాగాడు. ఆ ఛానల్‌లో అది అతని ఫేవరేట్ ప్రోగ్రాం. చాక్లెట్ల తయారీ గురించి చూపిస్తున్నారు. రాత్రి భోజనం అయ్యాక పళ్లు బ్రష్ చేసుకోవడానికి బాత్‌రూంలోకి వెళ్లిన విశ్వేశ్వరరావు వాష్ బేసిన్ మీద ఓ పక్క వున్న కట్టుడు పళ్లని చూసి ఆశ్చర్యపోయాడు. పై దంతాల కట్టుడు పళ్లవి.

''సూ'' పిలిచాడు భార్యని.

''ఏమిటి?'' అని అడిగింది సుమతి వచ్చి.

''ఇవెవరివి?'' అడిగాడు.

వాటిని చూసి క్షణకాలం సుమతి మొహం పాలిపోవడం గమనించాడు విశ్వేశ్వరరావు.

''మా అమ్మవి మర్చిపోయినట్లుంది''

''మీ అమ్మ ఏలూరు నుంచి ఎప్పుడు వచ్చింది?''

''ఉదయం మీరెళ్లాక వచ్చింది. మా అక్కయ్య ఇంటికి నిన్న వచ్చిందట''

''పాపం! భోజనం ఎలా చేస్తుంది? తీసుకెళ్లి ఇద్దామా?''

''రేపివ్వచ్చులెండి'' వారించింది సుమతి.

మర్నాడు విశ్వేశ్వరరావు నిద్ర లేచాక బాత్‌రూంలోకి వెళ్లి చూసే సరికి ఆ పళ్లు లేవు.

''ఏమయ్యాయి ఆ పళ్లు?'' అడిగాడు.

''మా అక్కయ్య కొడుకు పొద్దున్నే వచ్చి తీసుకెళ్లాడు.''

''నాకు శ్రమ తప్పింది. ఆఫీసుకి వెళుతూ దారిలో ఆగి ఇద్దామనుకున్నాను'' చెప్పాడు విశ్వేశ్వరరావు.

ఆరోజు ఆఫీసుకి వెళ్లాక అతను తన బాస్‌ని కలిసి వరంగల్ ట్రిప్ విశేషాలు చెప్పాడు.

''కోయంబత్తూరు సరుకులో నాణ్యత వుండదని చెప్పినా వినలేదు. మోసపోయాక తెలుస్తుందిలెండి. డాక్టర్ అరుగుదలకి పీచు పదార్థం తినమంటే, ఇలాంటి వాడే వెనకటికొకడు కొబ్బరి పీచుతో భార్యని కూర చేయమన్నాట్ట''

ఆ మాటలకి ఫక్కున నవ్వాడు బాస్.

ఆయన పై పలు వరుస స్థానంలో మోసిగా చిగుర్లు కనిపించగానే విశ్వేశ్వరరావు కెవ్వున అరిచాడు.

*